

హృదయ వేదన

వృద్ధులతోపాటు యువతలోనూ గుండెజబ్బుల ప్రమాదం వేగంగా పెరుగుతోంది. ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవనం హృదయ సంబంధ వ్యాధులు మరణాలకు కారణమవుతోంది. 8లో▸



వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

కొంతమంది గుర్తు తెలియని దుండగులు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన బాపులదొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,632.13
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 102
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 22,513
అవుట్ ఫ్లో	: 14,408

న్యూస్‌రీల్

మద్దిలేటి స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో మద్దిలేటి నరసింహస్వామి

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి భాద్రపదమాసం శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పుష్కరిణిలో వేకువ జాము నుంచే పుణ్యస్నానాలు చేసి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారికి ప్రీతి పాత్రమైన వరపూజ, ఆకుపూజ, నిర్వహించారు. స్వామి,అమ్మవార్లకు భక్తులు వివిధ సేవలు నిర్వహించుకోవడంతో క్షేత్రానికి రూ.80 వేల ఆదాయం వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్, ఈఓ రామాంజనేయులు తెలిపారు.

రేబిస్‌ను అశ్రద్ధ చేయొద్దు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎంఅండ్ హెచ్‌ఓ వెంకటరమణ

బొమ్మలసత్రం: కుక్క, పిల్లి లాంటి పెంపుడు జంతువులు కాటు వేసినప్పుడు అశ్రద్ధ చేయకుండా వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం వల్ల రేబిస్ లాంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. శనివారం ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా కార్యాలయ, వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి వైద్యశాలలో రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు. ర్యాలీలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, డాక్టర్లు జగదీష్ చంద్రారెడ్డి, కాంతారావ్ నాయక్, అష్రఫ్ అలీ, శ్రీజ, ప్రసన్న లక్ష్మీ, డాక్టర్ భరత్ కుమార్, జిల్లా అంటువ్యాధుల నివారణ అధికారి రమేష్, జిల్లా మాస్ మీడియా అధికారి రవీంద్ర నాయక్ నాయక్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ బాధితులకు సత్వర న్యాయం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ జాతులు, అణగారిన వర్గాల ప్రజలపై దాడులు, అత్యాచారానికి గురైన బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాల్‌లో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్‌ఓ పద్మజ, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, కమిటీ సభ్యులు చిటికెల సలోమి, ఎన్. రమేష్, జీవన్ రాజు, దిలీప్ రాజు, శ్రీనివాసులు, మమత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ సభ్యులు సూచించిన మేరకు అన్ని గ్రామాలలో శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించేందుకు భూములను గుర్తిస్తామన్నారు. నంద్యాల పట్టణంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కమిటీ సభ్యులతో చర్చించి త్వరితగతిన నిర్ణయం తీసుకుంటామన్నారు. జిల్లాలో ఉన్న 146 సంక్షేమ హాస్టళ్లో నెలకొన్న సమస్యలను సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. నందికొట్కూరు, ఆత్మకూరు, ఉయ్యాలవాడ, ప్యాపిలి మండలాలలో కుల ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన అంశాలను పోలీసు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కరించాలన్నారు. జిల్లాలో 2023 డిసెంబర్ వరకు ఎఫ్ఐఆర్ నమోదైన 156 కేసులకు సంబంధించిన 278 మంది బాధితులకు రూ.3.90 కోట్ల నష్ట పరిహారాన్ని అందించామన్నారు. ఎస్పీ అది రాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులను దాదాపుగా క్లియర్ చేశామన్నారు. ఎన్నికల ప్రక్రియ ఉండడం వల్ల కొంతమేర ఆలస్యం జరిగిందని పెండింగ్‌లో ఉన్న కేసులు అన్నింటిని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవోలు, డీఎస్పీలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గడివేముల మండలం బిలకల గూడూరు బాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నందికొట్కూరులో చౌడేశ్వరీదేవికి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్, నాయకులు



మహానంది ఆలయ ఆవరణలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



బేతంచెర్ల వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

స్వామీ.. చంద్రబాబుదే తప్పు!

- సీఎం చంద్రబాబు రాజకీయ కుట్రపై ధర్మాగ్రహం
- ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల పూజలు
- చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలని అర్చనలు
- మారుమోగిన గోవింద నామస్మరణ
- తిరుమల పవిత్రతను అప్రతిష్టపాలు చేస్తే సహించేది లేదని మండిపాటు

'ఘోర అపచారం జరిగింది. వేంకటేశ్వర స్వామిని పలుచన చేస్తూ.. పవిత్రమైన ప్రసాదాన్ని లోకువ చేస్తూ.. పచ్చి అబద్ధాలతో సీఎం చంద్రబాబు నాయుడు తిరుమల ప్రతిష్ట దిగజారేలా చేశారు. చంద్రబాబు చేసిన పాపం వల్ల వెంకటేశ్వర స్వామికి కోపం రాకుండా.. బాబును శిక్షించేలా అందరూ గుడిలో పూజలు చేయండి' అంటూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కదిలి వచ్చారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. చంద్రబాబు రాజకీయ కుట్రపై ధర్మాగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం ఆలయాల్లో పూజలు చేశారు. భగవంతుడు.. చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలని అర్చనలు చేశారు.

బొమ్మలసత్రం: వంద రోజుల పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో కూటమి ప్రభుత్వం చేసిన విష ప్రచారంపై శనివారం జిల్లా ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలయాల్లో పూజలు చేసి నిరసన వ్యక్తం చేశారు. కల్తీ నెయ్యి పేరుతో తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా చంద్రబాబు చేసిన రాజకీయ కుట్రపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ ఆరాధ్య దైవమైన తిరుమల వేంకటేశ్వరుడి ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేసిన చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని పూజలు చేశారు. ఓ వైపు శ్రీవారి లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి అసలు వాడలేదని టీటీడీ ఈవో స్పష్టంగా చెప్పినప్పటికీ పచ్చి అబద్ధాలతో చంద్రబాబు ప్రజలను నమ్మించాలని చూడటం దారుణమన్నారు. బాబు పాపం కడిగేలా ఆలయాల్లో పూజలు చేయాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా ప్రజలు కదలి వచ్చారు. నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్‌రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల పట్టణంలోని గుడిపాటిగడ్డ వీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, రామసుబ్బయ్య, శరత్, కౌన్సిలర్ కృష్ణమోహన్, పున్నా రాజేశ్వరి, బెస్త సంఘం మాజీ డైరెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలను మోసం చేయకుండా, హామీలు అమలు పరిచేలా చంద్రబాబు మనసు మార్చాలని భగవంతుడిని కోరుకున్నారు.

బనగానపల్లె నియోజకవర్గంలో..

మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటసాని రామిరెడ్డి బనగానపల్లెలోని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి టెంకాయలు సమర్పించారు. చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని ఆంజనేయ స్వామికి వినతి ప్రతం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్తీ నెయ్యి వాడకపోయినప్పటికీ లడ్డూ అపవిత్రమైందని ఎలా నిర్ధారించారో కూటమి నేతలే సమాధానం చెప్పాలన్నారు. కోవెలకుంట్ల పట్టణంలో కర్రా హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కల్లూరు పరిధిలోని కృష్ణానగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట భగవద్గీత చేతబూని నిరసన వ్యక్తం చేస్తున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

శ్రీశైలం నియోజకవర్గంలో...

ఆత్మకూరు పట్టణంలో వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైఎస్సార్‌సీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నేతలు వెంకటస్వామిగౌడ్, సురేష్, విజయ్, నాగరాజు సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని నాయకులు దేవున్ని వేడుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మహానంది క్షేత్రంలో పూజలు చేపట్టారు. వివాదాస్పద అంశాలను పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి హితవు పలికారు.

నందికొట్కూరు నియోజకవర్గంలో..

నియోజకవర్గ కేంద్రం నందికొట్కూరు పట్టణంలోని శ్రీ చౌడేశ్రీ దేవాలయంలో వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త డాక్టర్ దారా సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రాన్ని కూటమి ప్రభుత్వం రాజకీయాలు చేయటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాణ్యం నియోజకవర్గంలో..

వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కల్లూరు పరిధిలో కృష్ణానగర్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తిరుపతి లడ్డూ వ్యవహారంలో అసత్య ప్రచారం బెడిసి కొట్టడంతో ప్రజలను డైవర్ట్ చేసేందుకు చంద్రబాబు డిక్లరేషన్ ఇవ్వాలనే వాదన తీసుకువచ్చాడన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా రాష్ట్రంలో రాక్షస రాజ్యం నడుస్తోందని, దేవుడిని దర్శించుకోవాలంటే అనుమతి ఇవ్వకుండా ఇబ్బందులు సృష్టించడం దారుణమన్నారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో..

తిరుమల లడ్డూపై చేసిన నిరాధారణ ఆరోపణలు చేసిన సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అహోబిలం క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన ప్రభుత్వంపై వస్తున్న ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చే ప్రయత్నంలో కల్తీ నెయ్యిని తెరపైకి తెచ్చారని విమర్శించారు. ప్రజలకు మేలు చేయకుండా తప్పించుకుంటే వెంకటేశ్వర స్వామి తగిన బుద్ధి చెబుతారన్నారు. కోటపాడు గ్రామంలో ప్రజలు చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజాగ్రహం భయంతో విష ప్రచారం



డోన్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించారని సీఎం చంద్రబాబు నాయుడు విష ప్రచారం చేస్తున్నారని, సీబీఐ విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు చెప్పాలని మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన డిమాండ్ చేశారు. బాబు రాజకీయ కుట్రను నిరసిస్తూ డోన్ పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా పాదయాత్ర చేస్తూ వెంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. మంచి బుద్ధిని ప్రసాదించాలని బాబు పేరుపై అర్చనలు చేయించారు. అనంతరం బుగ్గన మాట్లాడుతూ తిరుమల క్షేత్రాన్ని చంద్రబాబు రాజకీయాల కోసం వాడుకోవటం దౌర్భాగ్యమన్నారు. స్వామి వారి వైభవాన్ని దెబ్బతీసేలా సీఎం ప్రచారం చేస్తుంటే దానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వంతపాడటం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఏఒక్కటి కూడా నెరవేర్చకపోవడంతో ప్రజాగ్రహానికి గురవుతాననే భయంతో గత ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. కుల, మత, వర్గ, విబేధాలు లేకుండా పరిపాలన చేస్తానని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి ప్రజల మనోభావాలను రెచ్చగొట్టి తన రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నిస్తుండటం దారుణమన్నారు.



బనగానపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో కొబ్బరి కాయలు కొడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



అహోబిలం ఆలయ ఆవరణలో ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, పార్టీ నేతలు

ఏఎస్ఐ సమక్షంలోనే బాధితునిపై టీడీపీ నేత దాడి

డోన్: విచారణలో భాగంగా స్టేషన్‌కు వచ్చిన బాధితునిపై పోలీసుల సమక్షంలోనే తెలుగుదేశం పార్టీ నేత దాడికి పాల్పడిన ఘటన డోన్ రూరల్ పోలీసుస్టేషన్‌లో చోటు చేసుకుంది. మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, ఎమ్మెల్యే కోట్ల ప్రధాన అనుచరుడైన ఓబులాపురం శేషిరెడ్డి అదే గ్రామానికి చెందిన శేషశయన ఆచారి అనే యువకునితో కలిసి పౌడర్ వ్యాపారం చేసేందుకు ఫర్మ్ రిజిష్టర్ చేయించుకున్నారు. అయితే ఇద్దరి మధ్య విభేదాలు వచ్చి 2021 సంవత్సరంలో లావాదేవీలన్నీ సెటిల్ చేసుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అప్పులు ఎక్కువై వ్యాపారంలో నష్టాలు రావడంతో శేషశయన ఆచారి తన తండ్రి శంకరయ్య ఆచారి పేరుపై బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్ రంగాపురం వద్ద ఉన్న పౌడర్ ఫ్యాక్టరీని విక్రయించారు.



శేషిరెడ్డి దాడిలో గాయపడ్డ శేషశయన ఆచారి



రూరల్ పోలీసుస్టేషన్ వద్ద తన గోడు వినిపిస్తున్న, శంకరయ్య ఆచారి

కేవలం ట్రేడింగ్‌లోనే భాగస్వామ్యం, ఫ్యాక్టరీలో కాదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శేషశయన ఆచారి, ఆయన తండ్రి శంకరయ్య ఆచారిలను తనకు ఉన్న పలుకుబడితో శేషిరెడ్డి రూరల్ సిఐ రాఖేష్ వద్దకు పిలిపించారు. శేషిరెడ్డితో తమకు ట్రేడింగ్‌లోనే లావాదేవీలు తప్ప, ఫ్యాక్టరీ మా నాన్నదని బాధితుడు శశశయన ఆచారి సిఐతో మొరపెట్టుకున్నాడు. ఫ్యాక్టరీ విక్రయించగా వచ్చిన రూ.80లక్షలను శేషిరెడ్డికి చెల్లించాలని, లేకపోతే రౌడీషీట్ ఓపెన్ చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పోగొడతానని సిఐ రాఖేష్ బెదిరించినట్లు బాధితుడు వాపోతున్నాడు. ఈ బెదిరింపులకు శేషశయన ఆచారి కుటుంబ సభ్యులు భయపడకపోవడంతో వారిపై మూడు రోజుల క్రితం 420 కేసు నమోదు చేసి నోటీసులు అందజేశారు.



ఎమ్మెల్యే కోట్ల వెంట ఉన్న శేషిరెడ్డి

కేసు రిజిష్టర్ తర్వాత విచారణ

నోటీసులు అందజేసిన రూరల్ పోలీసులు తిరిగి విచారణ పేరుతో శనివారం శేషశయన ఆచారిని శేషిరెడ్డి ప్రోద్బలంతో స్టేషన్‌కు పిలిపించారు. ఈ సందర్భంగా శేషశయన ఆచారి ముఖంపై పోలీసుల సమక్షంలోనే శేషిరెడ్డి పిడిగుద్దులు గుద్దారు. విషయం తెలిసిన పాత్రికేయులు రూరల్ స్టేషన్‌కు వెళ్లి సిఐ రాఖేష్‌ని కేసు విషయమై ప్రశ్నించగా శేషశయన ఆచారిపై పోలీసుస్టేషన్‌లోనే దాడి జరిగిన విషయం వాస్తవమేనన్నారు. అయితే ఆయన ఫిర్యాదు ఇస్తే శేషిరెడ్డిపై కేసు నమోదు చేస్తామన్నారు. తమకు ఎవరైనా ఒక్కటేనని.. సివిల్ పంచాయతీ విషయంలో విచారణకు శేషశయన ఆచారి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించామన్నారు.

ఇసుక లేకుండా ఇళ్లు ఎలా కట్టుకోవాలి



అధికారులను నిలదీస్తున్న లబ్ధిదారులు

పాణ్యం: ఇసుక లేకుండా ఇళ్లు ఎలా కట్టుకోవాలని, ఇంత వరకు ఇసుక ఎక్కడా దొరకడం లేదని గృహ నిర్మాణ లబ్ధిదారులు అధికారులను నిలదీశారు. శనివారం పాణ్యం జగనన్న కాలనీలో ''మన ఇళ్లు-మన గౌరవం'' నిర్వహించారు. కార్యక్రమానికి తహసీల్దార్ నరంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, హౌసింగ్ ఏఈ మహబూబ్‌బాషా, ఈఓఆర్డీ సులోచన, ఆర్ఐ మహేశ్వరరెడ్డి, ఈఓ ఆనందరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో మంజురైన ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో జోక్యం చేసుకున్న లబ్ధిదారులు, మేస్త్రీలు ఇసుక దొరకడం లేదని, అసలు ఇసుక ఎక్కడుందో తెలియడం లేదని, బ్లాక్‌లో దొరికినా ట్రాక్టర్ రూ.7వేల పైనే చెబుతున్నారన్నారు. అసలు ప్రభుత్వం ఇసుక పాలసీ ఎక్కడ ఉందో, ఉచిత ఇసుక ఎక్కడ దొరుకుతుందో చెప్పాలని అధికారులపై మండిపడ్డారు. ఇసుక లేకుండా ఇళ్లు ఎలా కడతారో చెప్పాలన్నారు. ప్రభుత్వం వచ్చి 4నెలలు పూర్తి చేసుకున్నా ఇసుక గురించి పూర్తి క్లారిటీ లేకపోతే ఎలాగని ప్రశ్నించారు. 'మీరే మాకు ఇసుక ఇవ్వండి.. లేకపోతే మాకు గత ప్రభుత్వం లాగా ఇసుక టోకెన్లు ఇవ్వండి' అంటూ అధికారులకు సూచించడంతో అధికారులు నీళ్లు నమిలారు. తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి మైక్ తీసుకోని ప్రస్తుతం నదుల్లో నీటి ప్రవాహం ఉందని, త్వరలోనే ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు. ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సర్ది చెప్పారు. రోడ్డు సరిగ్గా లేక వాహనాలు కాలనీకి రావడం లేదని లబ్ధిదారులు చెప్పగా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

జిల్లాలో క్విక్ రియాక్షన్ టీం ఏర్పాటు

బొమ్మలసత్రం: శాంతి భద్రతల పరిరక్షణ, నేర నివారణే లక్ష్యంగా క్విక్ రియాక్షన్ టీం ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీఅధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. జిల్లాలో కొంతమంది సిబ్బందిని ఎంపిక చేసి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడంతోపాటు యోగా, మార్షల్ ఆర్ట్స్, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించామన్నారు. ప్రతి సబ్ డివిజన్‌కి 11 మంది చొప్పున క్విక్ రియాక్షన్ టీం ఏర్పాటు చేశామన్నారు. వీరు సబ్ డివిజన్ కేంద్రంలో ఉంటూ స్పెషల్ పార్టీ ఎక్విప్‌మెంట్ ధరించి ఏదైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు శాంతిభద్రతల పరిరక్షణలో ముందు ఉండేలా శిక్షణ ఇచ్చామన్నారు. ఈ టీంలు సబ్ డివిజన్‌లలో జరిగే వీఐపీల బందోబస్తులు, రాస్తారోకో, ధర్నాలు చేసే ప్రాంతంలో విధులు నిర్వహించేలా శిక్షణ ఇచ్చామని ఎస్పీ తెలిపారు.



శిక్షణ పొందిన క్విక్ రియాక్షన్ టీంతో ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన మహ్మద్ షఫీ

ఓర్వకల్లు: జాతీయ రహదారిపై నన్నూరు వద్ద అభి డాబా ఎదురుగా శనివారం తెల్లవారు జామున గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన మమ్మద్‌షఫీ(35) వ్యక్తిగత పనిమీద బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి బయలుదేరాడు. పని ముగించుకొని బేతంచెర్లలో బస్సు ఎక్కి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో నన్నూరు వద్ద బస్సు దిగి పూటుగా మదం తాగి నడుచుకుంటూ వెళ్తుండగా నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొంది. బలమైన రక్తగాయాలు కావడంతో హైవే పెట్రోలింగ్ వాహనంలో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపారు.

ఆరోగ్య సిబ్బందిపై డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆగ్రహం


వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఉయ్యాలవాడ: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే వైద్య బృందం ఉన్న చోట పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంపై డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి ఉండడం, మురుగు నీరు నిల్వ ఉండటం, ల్యాబ్ పరిశుభ్రంగా లేకపోవడం, వైద్యాధికారి రాబర్ట్ కెనడీ, సిబ్బంది పనితీరుపై డీఎంఅండ్‌హెచ్‌ఓ మండిపడ్డారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుని, కుళాయిలకు సరఫరా అయ్యే నీటిని కాచుకుని నీరు తాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గర్భిణులకు సరైన వైద్యం చేసి, సలహాలు ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యం చేసే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హృదయ వేదన

వృద్ధులతోపాటు యువతలోనూ గుండె జబ్బుల ప్రమాదం వేగంగా పెరుగుతోంది. ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవనం.. హృదయ సంబంధ వ్యాధుల మరణాలకు ప్రధాన కారణమవుతోంది. ఈనెల 29న ప్రపంచ గుండె దినోత్సవం. ఈ సందర్భంగా జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.
– కర్నూలు(హాస్పిటల్)



లక్షణాలు

కొంతదూరం నడవగానే ఆయాసం, ఛాతిలో పట్టేసినట్లుగా ఉండటం, చెమట ఎక్కువగా పడుతుండటం, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటం ఉంటే గుండెజబ్బుగా అనుమానించాల్సి ఉంటుంది. సమీప ఆసుపత్రికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకుని, అవసరమైన చికిత్స తీసుకోవాలి. గుండెపోటు వచ్చిన మొదటి కొద్ది నిమిషాలు కీలకమైనవి.

- పెరుగుతున్న గుండెపోటు మరణాలు
- ఉన్నఫలంగా కుప్పకూలుతున్న యువత
- ఒత్తిడి జీవితంతో మరింత కుంగుబాటు
- నేడు వరల్డ్ హార్ట్ డే

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగంలో ఐదేళ్లలో గుండెజబ్బుల కేసులు పెరిగాయి. 2019 నుంచి ఇప్పటి వరకు 90,475 ఓపీ, 14,597 ఐపీ కేసులు నమోదయ్యాయి. వీరిలో 4,36,158 మందికి ఈసీజీ తీయగా 77,783 మందికి 2డీ ఎకో పరీక్ష చేయాల్సి వచ్చింది. ఇందులో 272 మందికి హోల్టర్ చేశారు. 1,095 మందికి టీఎంటీ పరీక్ష నిర్వహించారు. 3,328 మందికి యాంజియోగ్రామ్ నిర్వహించి, 1,188 మందికి స్టెంట్‌లు వేశారు. అధిక శాతం ఆరోగ్యశ్రీ(ఎన్‌టీఆర్ వైద్యసేవ) ద్వారా చికిత్స అందించినా కొన్ని ఆసుపత్రులు రోగుల నుంచి మెరుగైన వైద్యం కోసమంటూ డబ్బు వసూలు చేస్తున్నాయి. ఈ విషయమై రోగుల నుంచి ఫిర్యాదులు రావడంతో కొన్ని ఆసుపత్రులకు జరిమానాలు విధించి, మరికొన్నింటికి ఆరోగ్యశ్రీని నిలిపివేశారు.



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గుండెజబ్బుల విభాగం

రెగ్యులర్ వ్యాయామం

శారీరక శ్రమ లేకపోవడం కూడా గుండెజబ్బులకు ప్రధాన కారణం. వాకింగ్, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటి 30 నిమిషాల శారీరక శ్రమను ప్రతిరోజూ చేయాలి. ఇది గుండెను బలపరుస్తుంది. శరీరంలో కొవ్వు పేరుకోకుండా చేస్తుంది. తద్వారా ఊబకాయం, రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది.

సమతుల్య ఆహారం

గుండె ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారం చాలా ముఖ్యం. జంక్‌ఫుడ్, చక్కెర, అధిక కేలరీల ఆహారాన్ని నివారించండి. వీటికి బదులుగా మీ ఆహారంలో బాదం, వాల్‌నట్స్, అవకాడో, క్యారెట్ వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను చేర్చాలి. ఈ విషయాలు గుండె సిరలను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.

ఒత్తిడిని తగ్గించండి

ఎక్కువసేపు మెలకువగా ఉండటం, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను ఎక్కువగా ఉపయోగించడం వల్ల గుండెపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అటువంటి పరిస్థితిలో తగినంత నిద్ర(7–8 గంటలు) తీసుకోండి. ఒత్తిడిని తగ్గించేందుకు యోగా, ధ్యానం చేయండి. ఇది శరీరం ఒత్తిడి స్థాయిని తగ్గిస్తుంది. ఇది గుండెకు ప్రయోజనకరంగా ఉంటుంది.

జీవనశైలి మెరుగుపరచుకోండి

హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి జీవనశైలిని మెరుగుపరచుకోండి. పోషకాహారం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను స్వీకరించండి. దీంతో మీరు గుండెజబ్బుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు. ఏడాదికి ఒకసారైన ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యులను సంప్రదించండి.

ఐదేళ్లలో గుండె రోగుల వివరాలు

సంవత్సరం	ఓపీ	ఐపీ	ఈసీజీ	2డీ ఎకో	హోల్టర్	టీఎంటీ
2019	19,615	3,548	83,076	17,679	53	132
2020	9,574	1,142	49,046	4,547	11	44
2021	10,539	2,012	61,641	10,746	32	21
2022	13,787	2,913	79,172	15,884	73	320
2023	21,120	2,944	86,702	17,362	63	301
2024 (ఇప్పటివరకు)	15,840	2,038	76,521	11,565	40	275
మొత్తం	90,475	14,597	4,36,158	77,783	272	1,093

కారణాలు

ధూమపానం, నెయ్యి వాడకం, పరగడుపున రక్తంలో గ్లూకోజ్ ఎక్కువగా ఉండటం, అధిక కొలెస్ట్రాల్, రక్తపోటు, శారీరక వ్యాయామం బాగా తగ్గడం, తల్లిదండ్రుల్లో గానీ, తోబుట్టువులలో గానీ ఎవ్వరికైనా గుండెపోటు వచ్చినా కానీ ముందుగానే ఈ సమస్య ఉండటం, లిపోప్రోటీన్–ఎ, హైపర్ హోమోసిస్టెమియా, హైపర్ కాగ్యులబుల్ పరిస్థితి, కొకైన్ వాడకం లాంటివి ఉంటే ఈ సమస్యలు వస్తాయి. ధూమపానం ఉంటే 72 శాతం, అధిక కొలెస్ట్రాల్ ఉంటే 52 శాతం, కుటుంబంలో ఎవ్వరికైనా హార్ట్ ఎటాక్ చరిత్ర ఉంటే 35 శాతం గుండెపోటు వచ్చే అవకాశం యువతో ఎక్కువగా ఉన్నాయి.

గుండె జబ్బులు రాకుండా ఉండాలంటే..

- మద్యపానం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి.
- ప్రతిరోజూ వాకింగ్, యోగా, ధ్యానం చేయాలి
- శాస్త్రీయ సంగీతం వినాలి, పాత పాటల్లోని సాహిత్యం మనస్సుకు ఎంతో హాయినిస్తుంది. పాశ్చాత్య సంగీతం బీపీ, హార్ట్ బీట్‌ను పెంచుతుంది.
- లిఫ్ట్‌లో వెళ్లడం కంటే మెట్లు ఎక్కడమే మేలు
- సమతుల ఆహారం వల్ల గుండెకు బలం చేకూరుతుంది.
- నూనెలో వేయించిన ఆహారాన్ని తగ్గించుకోవాలి. బయట లభించే ఫాస్ట్‌ఫుడ్స్, బేకరి ఫుడ్స్‌కు, దిగుమతి చేసుకున్న చికెన్ లెగ్స్‌కు దూరంగా ఉండాలి.
- బజ్జీలు తినాల్సి వస్తే ఇంట్లోనే చేసుకోవాలి.
- బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. స్థూలకాయం తగ్గించుకోవాలి.
- వయస్సుకు తగినట్లు నిద్రపోవాలి. నిద్ర తగ్గితే శరీరం రోగాలను ఆహ్వానిస్తుంది.



గుండెజబ్బుల పట్ల అవగాహన పెరగాలి



ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ గుండె జబ్బుల పట్ల అవగాహన పెంచుకోవాలి. ఈ మేరకు గుండెకు ప్రధాన శత్రువులను దూరంగా ఉంచుకోవాలి. ఇందులో భాగంగా ధూమపానం, మద్యపానాలకు దూరంగా ఉండాలి. బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. మంచి ఆహారపు అలవాట్లను అలవాటు చేసుకోవాలి. ఆహారంలో ఉప్పు, షుగర్, కొవ్వు పదార్థాలను తగ్గించాలి. బయటి ఫుడ్‌కు సాధ్యమైనంత దూరంగా ఉండాలి. ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. వైద్యుల సూచన మేరకు మందులు వాడుతూ ఉండాలి.
– డాక్టర్ పి.చంద్రశేఖర్, ప్రొఫెసర్, కార్డియాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

నేడు అక్కినేని పురస్కారాల ప్రదానం

కర్నూలు కల్చరల్: స్థానిక సీక్యాంప్ కళాక్షేత్రంలో కొనసాగుతున్న నటసామ్రాట్, పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు ఆదివారం ముగియనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రతిభా విద్యాసంస్థల అధినేత ఎం.అరుణాచల రెడ్డి, గజల్స్ గాయకుడు, హెచ్ఎం ఎస్.మహమ్మద్ మియ్యా, రిటైర్డ్ ఎంఈఓ పి.రాజారత్నం, హాస్య నటులు, విశ్రాంత ఉద్యోగి సంగా ఆంజనేయులు, లలిత కళా సమితి మాజీ అధ్యక్షులు, విశ్రాంత అధ్యాపకులు పి.దస్తగిరి, జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వి.వి. రమణారెడ్డి, రచయిత, ఉపాధ్యాయుడు ఎస్.ఎం.డి. ఇనాయతుల్లాకు అక్కినేని పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అలాగే విజయవాడ వెలగేరు ఆర్ట్స్ కళాకారులు 'రాత' నాటికను ప్రదర్శిస్తారని తెలిపారు.

నేటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు


మాట్లాడుతున్న మోహన్‌కుమార్

కర్నూలు (టౌన్): నగరంలోని రిడ్జ్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈనెల 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బాలుర విభాగంలో ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ మోహన్‌కుమార్ తెలిపారు. శనివారం అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీబీఎస్‌ఈ క్లస్టర్ 7 కింద అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 150 స్కూళ్ల నుంచి 3,500 మంది క్రీడాకారులు పాల్గొంటారని, 24 మంది రెఫరీలు పర్యవేక్షణ చేస్తారని వెల్లడించారు. సమావేశంలో రిడ్జ్ పాఠశాల సీఈఓ గోపీనాథ్, గ్లోబల్ స్కూల్ సీఈఓ జి.వంశీధర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం


ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలిస్తున్న ప్రజలు

పెద్దకడబూరు: కొంతమంది గుర్తు తెలియని దుండగులు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన మండల పరిధిలోని బాపులదొడ్డి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. శనివారం ఉదయం ఆ రహదారిలో వెళ్తున్న ప్రజలు చూసి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి, వైఎస్సార్ సీపీ నాయకులకు, పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు విగ్రహాన్ని అక్కడి నుంచి బాపులదొడ్డి గ్రామం లోపలికి తరలించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు విగ్రహం ధ్వంసమైన ప్రదేశాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఇలాంటి పనికిమాలిన పనులు మానుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పెద్దకడబూరు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు.

ఔటర్ రింగురోడ్డు పనుల్లో నాణ్యత లోపం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం పరిధిలో చేపట్టిన ఔటర్ రింగురోడ్డు పనుల్లో నాణ్యత లోపం కనిపిస్తోంది. కొన్నేళ్ల క్రితం శ్రీశైలంలో ఔటర్ రింగురోడ్డు పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దేవస్థాన పుష్కరిణి పక్కన ఉన్న రోడ్డులోకి వర్షం నీరు చేరి రోడ్డు కోతకు గురై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నూతన ఈఈ నరసింహారెడ్డి భక్తుల ఇబ్బందులను గుర్తించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. సదరు రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టరు నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడం, ఇంజినీర్లు చూసీచూడనట్లు వ్యవహరించడంతోనే రోడ్డు కోతకు గురైందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


మరమ్మతులు చేస్తున్న దృశ్యం

అక్టోబర్ 6న జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలు


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): అక్టోబర్ 6న స్థానిక గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల క్రీడా మైదానంలో జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీగురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి తెలిపారు. శనివారం పాఠశాలలో క్రీడాపోటీల బ్రోచర్‌ను కర్నూలు జిల్లా సాఫ్ట్‌బాల్ సెక్రటరీ విజయకుమార్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామకృష్ణ పీజీ కళాశాల, గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లాలోని పీడీలు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, దాసు పాల్గొన్నారు.

1న రాష్ట్రస్థాయి పోటీలు

నంద్యాల(న్యూటౌన్): అక్టోబర్ 1న కేఎస్ఎం మున్సిపల్ పాఠశాల క్రీడా మైదానంలో తైక్వాండో, హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జోడో అండర్–17 హ్యాండ్ బాల్ అండర్–14, 17 బాల బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఎండీఎం ఫాంలో ఫైల్ అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఎవరి జోడో కిట్టు వారే తెచ్చుకోవాలన్నారు. ఉదయం 9గంటలకు క్రీడా మైదానానికి చేరుకోవాలన్నారు. పోటీలను కర్నూలు, నంద్యాల డీఈఓలు సామేలు, సుధాకర్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు.

తీరని దుఃఖం

- మొన్న విద్యుత్ ప్రమాదంలో కుమారుడు.. నేడు అనారోగ్యంతో తండ్రి
- మూడు రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో రెండు మరణాలు



వెంకటసుబ్బయ్య, వెంకటరమణ(ఫైల్)

ఆత్మకూరు రూరల్: ఒక మరణం కుటుంబంలోనూ, బంధుమిత్రుల్లో వేదన మిగుల్చుతుంది. అలాంటిది మూడు రోజుల వ్యవధిలో ఒకే ఇంట్లో.. అదీ తండ్రీకొడుకులు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల దుఃఖం భరించలేనిది.. ఇలాంటి ఘటనే మండల పరిధిలోని నల్లకాల్వ గ్రామంలో చోటుచేసుకుంది. ఈనెల 26న గ్రామానికి చెందిన వెంకటరమణ (30) తన పొలంలోని వరి పైరుకు నీళ్లు పెట్టే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. అతనికి కుమార్తె ఉండగా భార్య ప్రస్తుతం ఆరు నెలల గర్భిణి. చెట్టంత మనిషి అకాల మరణం చెందడంతో ఇంటిల్లిపాది దుఃఖ సాగరంలో మునిగిపోయారు. శనివారం మూడో రోజు మెతుకు కార్యక్రమంలో ఉండగా అతని తండ్రి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య (75) అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో మృతిచెందాడని తెలిసి నల్లకాల్వ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇక వారి కుటుంబ సభ్యుల వేదన వర్ణనాతీతం. కాగా విషయం తెలుసుకున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి.. వెంకటసుబ్బయ్య మృతి తీరని లోటు అన్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని శిల్పా పేర్కొన్నారు.